




చిన్నారికి స్వీటు తినిపిస్తున్న మంత్రి సవిత



జెసి Vs పెద్దారెడ్డి

- ◆ తాడిపత్రిలో కొనసాగుతున్న హై టెన్షన్
- ◆ ఆగని మాటల యుద్ధం
- ◆ వెళ్తానంటున్న పెద్దారెడ్డి
- ◆ అడ్డుకుని తీరుతానంటున్న ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిలో రాజకీయ వేడి తారాస్థాయికి చేరుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతల మధ్య మాటలతో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. హైకోర్టు అనుమతితో తాడిపత్రిలో అడుగు పెడతానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెప్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాడిపత్రిలో అడుగుపెట్ట నివ్వబోనని జెసి ప్రభాకర్ రెడ్డి బాహాటంగానే హెచ్చరికలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగిపత్రిలో ఎప్పడే ఏమి జరుగుతోందో అన్న టెన్షన్ అందరిలోనూ కన్పిస్తోంది.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టలేదు. ఇటీవల ఆయన్ను తాడిపత్రిలోకి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ కోర్టు అనుమతి మేరకు తాను తాడిపత్రిలోకి వెళ్తానంటూ పెద్దారెడ్డి ప్రకటించారు. అయితే గతంలో తాము అధికారంలో లేనప్పుడు పెద్దారెడ్డి తమపై దౌర్జన్యాలకు పాల్పడ్డారని మున్సిపల్ ఛైర్మన్ జెసి. ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నారు. దీనికి ప్రతిగా తాము ఇప్పుడు ఆయన్ను రానివ్వకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. తమపై తప్పుడు కేసులు పెట్టి కుటుంబాన్ని తీవ్రమైన ఇబ్బందులకు గురి చేశారని జెసి చెప్తున్నారు .ఆనాడు తమకు కూడా కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. అయినా రానివ్వకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రయత్నించారని ఆరోపించారు. కాగా వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాత్రం తాను తాడిపత్రి వచ్చి తీరుతానని చెబుతున్నారు. ఆయన మూడు రోజుల్లో జిల్లా ఎస్పీని కలిసి హైకోర్టు ఉత్తర్వును అందజేసి తాడిపత్రికి వెళ్లే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు ఇచ్చే సమయాన్ని బట్టి ఈనెల 8 లేదా 9వ తేదీల్లో తేదీల్లో పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్తారని ప్రచారం నడుస్తోంది.

గతంలో వారు... ఇప్పుడు వీరు..!

1980 దశకం నుంచి ఓటమన్నది ఎరగకుండా తాడిపత్రిలో జెసి కుటుంబం ఓటమన్నది ఎరగకుండా అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వచ్చింది. తొలిసారిగా 2019 ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి జెసి కుటుంబంపై విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి రాగానే జెసి కుటుంబంపై కేసుల పర్వం మొదలైంది. బిఎస్ త్రీ వాహనాల కొనుగోళ్లలో అవకతకులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో ప్రభాకర్ రెడ్డి ఆయన తనయుడు అస్మిత్ రెడ్డిలు జైలుకు వెళ్లి వచ్చారు. ఇదే సమయంలోనే జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటికి కేతిరెడ్డి పెద్దారెడ్డి వెళ్లడం అప్పట్లో రాష్ట్ర స్థాయిలోనే పెద్ద దుమారం రేపింది. ఇక 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పెద్దారెడ్డి ఓటమి చెందారు. రాష్ట్రంలోనూ వైసిపి అధికారం కోల్పోయింది. తాడిపత్రి ఎమ్మెల్యేగా జెసి.అస్మిత్ రెడ్డి గెలుపొందారు. టిడిపి అధికారంలోకి రావడంతో జెసి.ప్రభాకర్ రెడ్డి పెద్దారెడ్డికి గట్టిగానే కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. పెద్దారెడ్డి హయాంలో జరిగిన అక్రమాలను వెలికి తీసే పని చేయడమే కాకుండా, ఆయన్ను తాడిపత్రిలో అడుగుపెట్టనివ్వనని సవాల్ విసిరుతున్నారు. ఇప్పటి వరకు అయితే పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టలేదు. ప్రస్తుతం హైకోర్టు తీర్పు నేపథ్యంలో పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గంలో పర్యటిస్తానని చెప్తున్నారు. ఇలా ఇద్దరు నేతల మధ్య రాజకీయ వేడి ఒక రకంగా యుద్ధాన్ని తలపిస్తోంది. ఘర్షనలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి పోలీసులు అనుమతిస్తారా.. లేదా..? లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

బాలికలు అభివృద్ధి చెందేలా కిశోరి వికాసం

రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కిశోరి వికాసం ద్వారా బాలికల సర్వతో ముఖాభివద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత అన్నారు. సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో గర్భిణులు, పౌష్టికాహారం, చిన్నారులకు మంత్రి అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆడపిల్లలు స్కూల్ డ్రాప్ అవుట్‌లు కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, తహశీల్దార్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, సిడిపిఒ శాంత లక్ష్మి, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సభ్యులు, వెల్ఫేర్ సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఇ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఇ

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితను శ్రీసత్యసాయి జిల్లా నూతన విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖకు సంబంధించిన పలు సమస్యలు చర్చించారు. రైతులు, ప్రజల ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 236 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెసితో పాటు డిఆర్ఒ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా వెళ్లి పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా ఆయా శాఖల జిల్లా అధికారులే స్వయంగా పరిశీలించాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కేంద్రానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పరిశ్రమ శాఖ జీఎం నాగరాజు, సిపిఒ విజయకుమార్, ఏపీఎంవైపి పీడీ సుదర్శన్, ఎల్‌జిఎం.రమణ కుమార్, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి బాయి, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ శాఖ మోహన్ రావు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపల్ తదితరులు

హోదాతో సంబంధం లేకుండా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఎస్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రయివేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు ఉద్యోగం చేస్తూ ఆర్థిక స్వతంత్రంతో బతికినప్పుడే సమాజంలో విలువ ఉంటుందన్నారు. ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసు ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ కె.పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఐ ఫోన్ తయారీలో టెస్టింగ్ అండ్ క్వాలిటీ అనలిస్టుగా ఎంపికయ్యే విద్యార్థులు హోసూర్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన 36మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేషులు, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ డా॥శ్రీలక్ష్మి, జేకేసి కోఆర్డినేటర్ డా॥రవి నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నర్సింహులు పాల్గొన్నారు.



మెమొంటోలు అందించిన విద్యార్థులతో సువర్ణ భారతి కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠ రెడ్డి తదితరులు

ట్యాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు

40 మంది విద్యార్థులకు సువర్ణ భారతిలో ఉచిత విద్య

చిన్మయి సేవా ట్రస్ట్ ప్రతినిధి వెంకట్

ప్రజాశక్తి-హిందూపురం

పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం కళాశాలలో బహుమతులు అందజేశారు. టాలెంట్ బెస్ట్‌లో అత్యధిక మార్కులతో అమత ప్రథమ స్థానంలో నిలువగా మానస, ధనుశ్రీ ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచారు. ఆయా విద్యార్థినులకు సువర్ణ భారతి కళాశాల ఆధ్వర్యంలో కళాశాల వ్యవస్థపక అధ్యక్షులు నీలకంఠ రెడ్డి, సెక్రటరీ అనిల్ కుమార్‌లు నగదుతో పాటు మెమొంటో అందించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా చిన్మయి సేవా ట్రస్ట్ ప్రతినిధి వెంకట్ మాట్లాడుతు టాలెంట్ టెస్టులో మొదటి 40 స్థానాల్లో ఉన్న విద్యార్థులకు హిందూపురం పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాల నిర్వహకులు ఇంటర్మీడియట్ ఉచిత విద్య అందించడానికి ముందుకు రావాడం సంతోషంగా ఉందన్నారు. సువర్ణ భారతి కళాశాల ఛైర్మన్ నీలకంఠారెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యలో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలియజేశారు.

బహుజన చైతన్యం కోసమే కవియాత్ర

ప్రజాశక్తి-పెనుకొండ

బహుజన చైతన్యం కోసమే కవియాత్ర అని జిల్లా రతయిచల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. విశ్వం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కవియాత్ర సోమవారం పెనుకొండ పట్టణం చేరుకోగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలిచాంద్ బాషా, నియోజకవర్గ అధ్యక్షులు కోగిర జయచంద్ర ఆహ్వానం పలికారు. కవియాత్ర నిర్వాహకులు మాట్లాడుతూ కవిత్వాన్ని బతికిస్తూ కవిత్వం మనుగడ, తెలుగు భాష వికాసం, ఔన్నత్యం, సాహిత్యాన్ని కొత్త పంథాలో నడిపించడం కోసం ఈ యాత్ర కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలుగు కవులు, సాహితీవేత్తలను ఒక వేదికపైకి తేవడానికి విశ్వం ఫౌండేషన్ కవి యాత్ర కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. గగన్ మహల్‌లో భువన విజయాన్ని తలపించేలా కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్వీ రఘువీర్ ప్రతాప్, తండు కృష్ణ, విశ్వం ఫౌండేషన్ దాసోజు శ్రీనివాసులు, దాసోజు శ్రవణ్ కుమార్, దాసోజు జ్ఞానేశ్వర్, దాసోజు రవికుమార్, చొల్లేటి నరసింహాచారి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

'కుట్టుశిక్షణ పేరుతో దోపిడీ'

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

బిసిల పేరుతో దోచుకునేందుకు ప్రభుత్వం స్కీంలు పెడుతుందని వైసిపి వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర విమర్శించారు. మండలంలోని అమ్మవారుపల్లిలోని తన నివాసంలో సోమవారం వాల్మీకి సాధికారత సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో మహిళకు రూ.23వేలు కేటాయిం చిందన్నారు. అయితే వాస్తవంగా స్టైఫండ్ రూ. 3 వేలు, మిషన్ రూ. 4,300 కలిపి ఒక్కో మహిళపై కేవలం రూ. 7,300 ఖర్చు చేస్తూ రూ. 16,700 దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా రూ. 230 కోట్లు కేటాయించగా కేవలం రూ. 73 కోట్లు ఖర్చు పెట్టి మిగిలిన రూ. 167 కోట్లు ఏమి చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీలను ఎండ గడతామని వాల్మీకి సాధికార కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బొగ్గు కృష్ణ, ఆనంద్, గుట్టూరు పిట్టబాబు, బోయ ఆనంద్, మజ్జిగ నాగరాజు, పరంధామ, తదితరులు పాల్గొన్నారు.

'హిందూపురం' అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ - మంత్రి అనగానిసత్యప్రసాద్‌తో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం



పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మంత్రి అనగాని సత్యప్రసాద్



టేకులోడు పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ దంపతులు

రాష్ట్రంలో హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన నియోజవకర్గంలోని హిందూపురం, లేపాక్షి మండలాల్లో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో కొట్టునూరు గ్రామం కొల్లకుంట కాలనీలో 237 ఇంటి పట్టాలకు పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చిలమత్తూరులో నూతన సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, బాలకృష్ణ సతీమణి వసుంధర, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. హిందూపురంలో ఇళ్ల పట్టాలకు పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందన్నారు. వచ్చే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవను అమలు చేస్తున్నామని చెప్పారు. అమరావతితోపాటు రాజధానిని కలుపుతూ జరిగే అన్ని రహదారుల నిర్మాణ పనులు త్వరగా జరగాలని ప్రధాని మోదీ కోరుతున్నారని ఆమేరకు పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. హిందూపురం నియోజకవర్గ ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలకు సర్వ హక్కులూ కల్పించాలనే ఉద్దేశంతో హిందుపురం పట్టణం కొట్నూరు పంచాయతీ కొల్లకుంట కాలనీ పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లను అందిచామని తెలియజేశారు. ఈ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకుల నుంచి రుణం పొందవచ్చని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన సంవత్సరంలోపే హిందూపురం నియోజకవర్గంలో ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులు రూ.50 కోట్లతో ప్రతి గ్రామానికి తారు రోడ్డు. సౌకర్యం, సిసి రహదారులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాల్టీలో 38 వార్డుల్లో సిసి రహదారులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రూ.92.5 కోట్ల మంజూరు చేయించామన్నారు. ఈ పనులను త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. హిందూపురం పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అంతర్గత పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.136 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలియజేశారు. ఈ పనులనూ త్వరలో ప్రారంభిస్తామన్నారు. వినాయక నిమజ్జనం చేసే గుడ్డం కోనేరు మరమ్మతులకు ఆహుడా నుంచి రూ.1.50కోట్లు మంజూరు అయ్యాయన్నారు. హిందూపురం నియోజవకర్గంలో సుమారు 2వేల మంది టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రానున్న నాలుగేళ్లలో హిందూపురాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డిఇ.రమేశ్, హౌసింగ్ పీడీ, స్పెషల్ ఆఫీసర్ వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, ఆర్డీవో ఆనంద్ కుమార్, టిడిపి నాయకులు మల్లికార్జున్ గౌడ్, చంద్ర శేఖర్, శివశంకర్, పరిమళ, బేవిన హళ్లి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో డైనింగ్ హాల్‌కు భూమిపూజ

చిలమత్తూరు : చిలమత్తూరు మండలంలోని టేకులోడు మహాత్మా జ్యోతిబాపూలే ఎంజెపి గురుకుల పాఠశాలలో రూ.85 లక్షల వ్యయంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో నిర్మించనున్న నూతన డైనింగ్ హాల్ నిర్మాణానికి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ భూమిపూజ చేశారు. ఆర్‌డిటి సహకారంతో నిర్మిస్తున్న ఈ డైనింగ్ హాల్ విద్యార్థులకు భోజన సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే బాలకష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, శ్రీనివాసరావు, సురేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, కొడికొండ బాలాజీ, తిప్పారెడ్డి, నందీశప్ప, మల్లికార్జున, శ్రీదేవి, విజయ్ కుమార్, సర్పంచి బయప రెడ్డి, ఎంపిడిఒ రమణ మూర్తి పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమం, భద్రతే టిడిపి ధ్యేయం : మంత్రి



వీరన్న కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-రొద్దం

కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ ఒక్క టిడిపినే అని మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్యకర్తలు పి.ఈరన్న, సంజీవప్ప రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారు టిడిపి సభ్యత్వం తీసుకున్నందున పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రమాద బీమా మంజూరైంది. దీంతో మంత్రి సోమవారం ఆ గ్రామం వెళ్లి మృతుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి, మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉనికి కోసమే వైసిపి చీప్ పాలిటిక్స్ : మంత్రి

ఉనికి కోసమే వైసిపి చీప్ పాలిటిక్స్ చేస్తోందని, వాటిని తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి సవిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ వైసిపికి 11 సీట్లు వచ్చినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. ప్రపంచంలోనే అమరావతి నెంబర్ వన్ సిటీగా అవతరించ నుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, మాధవ నాయుడు, చంద్రమౌళి, వెంకట్రామిరెడ్డి, చిన్నప్పయ్య, టైలర్ ఆంజనేయులు, అశ్వత్థనారాయణ, చిన్నమంతూరు పవన్, శ్రీనాథ్‌చౌదరి, ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు, మంజునాథ్, కంబాలపల్లి సర్పంచి మంజునాథ్, వీరాంజనేయులు, ముత్యాలు, లింగప్ప, నగేష్, డీలర్ శేషు, గౌరాజుల్లి డీలర్ బాబు, హరీష్, నాగిరెడ్డిపల్లి హనుమంతప్ప, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎం.కొత్తపల్లి సచివాలయం తనిఖీ

మండలంలోని ఎం.కొత్తపల్లి సచివాలయాన్ని మంత్రి సవిత సందర్శించి రికార్డులను పరిశీ లించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉద్యోగులను హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే బాలయ్యకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-హిందూపురం



ఎమ్మెల్యే బాలకృష్ణకు వినతిని అందిస్తున్న సిఐటియు, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు

హిందూపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్.రాములు కార్మిక సమస్యలపై ఎమ్మెల్యేతో మాట్లాడారు. హిందూపురం మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు 220 మంది గత 35 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఆప్కాస్ విధానం తీసుకొచ్చిందని, దీనివల్ల 60 సంవత్సరాల తర్వాత కార్మికులను తొలగిస్తున్నారని చెప్పారు. అనారోగ్య సమస్యలతో కార్మికులు చనిపోగా ఆయా కుటుంబస్తులకు ఉద్యోగం ఇవ్వడం లేదన్నారు. 60 సంవత్సరాల పేరుతో 17 మంది కార్మికులను తొలగించారని తెలిపారు. వీరందరికీ ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ప్రభుత్వం నుంచి ఇవ్వలేదని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్‌తో పాటు కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాల్సుందన్నారు. వీటిపై స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, సహాయ కార్యదర్శి చంద్ర, నాయకులు రామచంద్ర, రామంజప్ప, శంకర కుమార్, అంజి, ప్రసాద్, నారాయణ, బాబయ్య, శివ, చంద్రశేఖర్, మహిళా నాయకులు కవితమ్మ, గంగ రత్నమ్మ, మహేశ్వరమ్మ, లక్ష్మమ్మ, అశ్వర్థమ్మ పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒకు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



డిఎంహెచ్‌ఒకు వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

ఆశా వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న సమ్మెకు సంబంధించి సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల జిల్లా యూనియన్ నాయకులు డిఎంహెచ్ఒ ఫిరోజ బేగమ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, తదితర డిమాండ్ల సాధనకై ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు బి.సాంబశివ, జిల్లా అధ్యక్షురాలు త్రివేణి, జిల్లా నాయకులు గాయిత్రి, గంగులమ్మ, నాగలక్ష్మి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు డోలా రాజారెడ్డి, తదితరులు

ధర్మవరంలో భూకబ్జాలను బయటపెడతాం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూకబ్జాలు, అవినీతి, అక్రమాలను బయటపెడతామని బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, కంచం లీలావతి స్పష్టం చేశారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల మంత్రి సత్యకుమార్ యాదవ్, హరీష్‌బాబుపై వైసిపి నాయకులు, కౌన్సిలర్లు చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించారు. వైసిపి నేతలు చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యం అన్నారు. రాజారెడ్డి మాట్లాడుతూ కుసుమరాజ గ్రామ సమీపంలో నేను కొన్న భూమికి తప్పుడు అగ్రిమెంట్ సృష్టించి కేతిరెడ్డి డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు. నా నుంచి రూ. 20 లక్షల వసూలు చేసిన వైసిపి నాయకులను వదిలే ప్రసక్తే లేదన్నారు. వైసిపి నాయకులు గతంలో చేసిన అవినీతి, అక్రమాలపై ఈ నెల 10వ తేదీ చెన్నకేశవస్వామి రథోత్సవం వద్ద ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాల్ చేశారు. కంచం లీలావతి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి, కేతిరెడ్డి లోపాయికారి ఒప్పందం చేసుకొని ఓట్లు కేతిరెడ్డికి వేయించుకున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న బాలయ్య సతీమణి వసుంధర

కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలయ్య ప్రత్యేకపూజలు

హిందూపురం : పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం 85వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధర దేవిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠాపనచేసిన అమ్మవారి బంగారు విగ్రహాన్ని బాలకృష్ణ దంపతులు ఆవిష్కరించి, బంగారు పుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు బాలయ్య దంపతులను ఘనంగా సన్మానించి, వసుంధర దేవికి వడిబియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జెపికె రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

పెనుకొండ : ఈ నెల 13వ తేదీ పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంత్రి జాబ్‌మేళా గోడపత్రికను విడుదల చేశారు. జాబ్‌మేళాలో 50కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని 2వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, ఏదేని డిగ్రీ, బి.టెక్, పి.జి. చదివి 18-35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వివరాలకు 9966682246, 7981541994, 93988 11689లో సంప్రదించాలన్నారు.

భూ రీసర్వే ప్రారంభం

చిలమత్తూరు : మండలంలోని వీరాపురం పంచాయతీలో సోమవారం భూ రీ సర్వే ప్రారంభమైంది. తహశీల్దార్ వెంకటేశ్ ఆదేశాలతో మండల సర్వేయర్ కోదండపాణి రీసర్వేను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రైతు భూమికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. రైతులు 1-బి, పట్టా తదితర పత్రాలతో తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని కోరారు. భూ వివాదాలుంటే వెంటనే గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని సూచించారు.

విద్యార్థిని కంటి వైద్యానికి ఆర్థికసాయం

నల్లచెరువు : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన విద్యార్థిని రేష్మితకు కంటి చూపు మందగించి ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న వైసిపి గాండ్లపెంట మండల ఇన్‌ఛార్జి శ్రీకాంత్‌రెడ్డి రేష్మిత వైద్య ఖర్చులకు అయ్యే మొత్తం ఖర్చులు భరిస్తానని నల్లచెరువు మండల కన్వీనర్ మోదెం రవి కుమార్ రెడ్డి ద్వారా రేష్మిత తండ్రి ప్రభాకర్ రెడ్డికి తెలిపారు. దీంతో సోమవారం సాయంత్రం రేష్మిత తండ్రి ప్రభాకర్‌రెడ్డి కదిరిలో శ్రీకాంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు ఎం.రవికుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి ఉన్నారు.

వైద్య ఖర్చులకు చేయూత

రొద్దం : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దంపతుల వైద్య ఖర్చులకు దొడగట్ట టింబర్స్ కల్యాణ్ కలయిక సంస్థ ఆర్థికసాయం సోమవారం రూ. 20 వేలు అందజేశారు. గత నెలలో పరిగి మండలంలోని ధనాపురం క్రాస్‌లో ఆటోను ఐచర్ ఢీ కొనడంతో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే ప్రమీలమ్మ, ఆమె భర్త అంజనరెడ్డి తీవ్రంగా గాయపడి బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి టింబర్స్ కల్యాణ్ కలయిక సంస్థ సభ్యులందరూ కలిసి రూ. 20 అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సంస్థ మేనేజర్ మహేష్, సిఈఓ లావణ్య, కుటుంబ సభ్యులు ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు 7న సన్మానం


కదిరి టౌన్ : పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి టాపర్లుగా నిలిచిన వసతి గృహాల్లోని విద్యార్థులు, సంబంధిత అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఈ నెల 7వ తేదీ మంత్రి సవిత విజయవాడలో సన్మానిస్తుందని డిఎస్‌సిడబ్ల్యుఓ శివరంగ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డివిజన్ అధికారి రెడ్డి బాలాజీ తెలిపారు. వాటిలో పదో తరగతిలో 570 మార్కులు సాధించిన బి.అంజత్ కుమార్(ఓడిసి ఎస్సీ హాస్టలు), ఇంటర్‌లో 945 మార్కులు సాధించిన జానవి(హిందూపురం)లను మంత్రి సవిత సన్మానిస్తుందని తెలిపారు.

నగదు బహుమతి అందజేత

ముదిగుబ్బ : మండలంలోని జడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కదిరి మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వరదారెడ్డి ఆర్థికసాయం చేశారు. స్థానిక బాలుర, బాలికల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు హర్షవర్ధన్-589, నరసింహ, దేవా-585, శివానీ- 575, మోక్ష వర్ధన్-561, నవిత-564, మమత-556 మార్కులు సాధించడంతో వరదారెడ్డి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఓలు వేమనారాయణ, రమణప్ప, హెచ్‌ఎంలు రాఘవ, రమాదేవి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే సన్మానం

నల్లచెరువు : విద్య అనేది ఎవరూ దోచుకోలేని ఆస్తి అని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. స్థానిక గీతా మందిరంలో సోమవారం టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో 593 మార్కులు సాధించిన విద్యార్థిని సాధికను ఘనంగా సన్మానించారు. ఆమె ఇంటర్ చదివేందుకయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. టిడిపి కార్యకర్తలు ప్రతి ఒక్కరినీ కలుపుకొని స్నేహపూర్వకంగా ముందు కెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు.



విద్యార్థిని సాధికను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎపిటిఎఫ్ జోనల్ బాధ్యులు కె.మల్లికార్జున అధ్యక్షతన పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. పిఆర్సి కమిటీని వెంటనే వేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పెండింగ్ డిఎలు మంజూరు చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో-117 రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తుంటే ఆ జీవోను రద్దు చేయకపోగా గతంలో ఆరు రకాలుగా ఉన్న పాఠశాలలను ఇప్పుడు 9 రకాల పాఠశాలలుగా మారుస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. వీరికి జిల్లా ఎంఇఒల సంఘం ప్రధాన కార్యదర్శి రవిచంద్ర సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలలుగా మారుస్తూ అసంబద్ధ విధానాలతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోనల్ బాధ్యులు మల్లికార్జున మాట్లాడుతూ బదిలీల్లో అసంబద్ధ విధానాలను తొలగించి అందరికీ సమన్యాయం చేసేలా బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గిరిధర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాజుల గోపాల్, వెంకటరమణనాయక్, ఆంజనేయులు, చంద్రమౌళి, చంద్ర, సంజీవరాయుడు, శ్రీనివాసులు, మల్లికార్జున, సీనియర్ నాయకులు రఘునాథరావు, జవ్వాజి నాగరాజు, శ్రీనివాసరావు, లక్ష్మానాయక్, గౌరీశ్వరి, వసంతలక్ష్మి, రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపిటిఎఫ్ జోనల్ బాధ్యులు కె. బలరాముడు అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు బికె.ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, శివానంద, శ్రీనివాసులు, జగదీష్ బాలయ్య, నరసింహులు, హరిప్రసాద్, గోపాల్, శంకర్ నారాయణ, వాసు కుమార్, రవికుమార్, హేమంత్, కృష్ణమూర్తి, వెంకటేష్, నాగప్ప, బయన్న, దుర్గాప్రసాద్, సుదర్శన్, ఓబులేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడకశిర : పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎంజారప్ప, ప్రధాన కార్యదర్శి జయరామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రాఘవేంద్రరావు, శ్రీనివాసరెడ్డి, బాలరాజు, శ్రీనివాసులు, సిద్దార్థ, నవీన్‌కుమార్, నాగేష్, విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు



ధర్మవరంలో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయుఎ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఆర్‌డిఒ మహేష్, తహశీల్దార్ నటరాజుకు వినతి పత్రం అందజేశారు. జోనల్ ఉపాధ్యక్షులు శేఖర్, జిల్లా ఛైర్మన్ ముత్యాలప్ప, రీజినల్ నాయకులు శంకరయ్య, డిపో కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో కోశాధికారి వైవిఆర్ రెడ్డి, రాయుడు, హరికృష్ణ, మంజునాథ్, ప్రసాద్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఎన్‌ఎంయుఎ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ సువర్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ అధ్యక్షులు శ్రీరామ్‌నాయక్, కార్యదర్శి షబ్బీర్, ముఖ్య ఉపాధ్యక్షులు రవితేజ, ఉపాధ్యక్షులు తిరుపతమ్మ, జిల్లా కోశాధికారి చిన్న రాయుడు, డిపో కమిటీ ముఖ్య సలహాదారు అప్పిరెడ్డి, ఛైర్మన్ ఈశ్వరయ్య, ప్రెసిడెంట్ శివశంకర్, వైస్ ప్రెసిడెంట్ సిఎస్ఎన్.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజగోపాల్, కార్యదర్శి గంగులయ్య, అసిస్టెంట్ సెక్రటరీ లక్ష్మీపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయలక్ష్మి, ముఖ్య సలహాదారు ఎఎన్.మూర్తి, జాయింట్ సెక్రటరీ రవీంద్ర, రమణ, కుళ్లాయప్ప, గ్యారేజ్ కమిటీ నాయకులు మనోహర్, బిఆర్‌సి.నాయక్ పాల్గొన్నారు.

మడకశిర : ఆర్టీసీ ఉద్యోగులు, డిపోలో నెలకొన్న సమస్యలపై ఎన్‌ఎంయుఎ నాయకులు తహశీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ రామకృష్ణ, అధ్యక్షులు ముద్దప్ప, సహకార్యదర్శి జయసింహా, ఉపాధ్యక్షులు పురుషోత్తం, సభ్యులు నర్సప్ప, మల్లికార్జున, నారాయణ, ప్రణీత్, పాపన్న, ఫకృద్దీన్‌సాబ్, జావీద్, శ్రీరాములు, సోమశేఖర్ పాల్గొన్నారు.



తహశీల్దార్ నటరాజుకు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌టిసి కార్మికులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల న్యాయ సేవాధికార సమితి ఛైర్మన్ కె. శైలజ సూచనల మేరకు సోమవారం పట్టణంలోని త్యాగరాజ నగర్ మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వాహకులు కె.సాయికళ కె.మాళప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడిలో కార్మిక చట్టాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మిక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖాధికారులు రమణా రెడ్డి, శేఖర్ బాబు, గోపాలకష్ణ, శశి కుమార్, చంద్ర కాంత్, డ్రాయింగ్ మాస్టర్ శ్రీశైలం, ఉపాధ్యాయులు కుమారి, మమత, శిరి, సాయి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : బాల కార్మికుల చేత పని చేయడం, బాల్య వివాహాలు చేయడం తీవ్ర నేరాలని న్యాయ అనుసంధాన కర్తలు హెచ్చరించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిజాంవలి కాలనీలో మహిళా బీడీ కార్మికులకుతో సమావేశం నిర్వహించారు. న్యాయ అనుసంధానకర్తలు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, కె.నరసింహులు, కార్మిక శాఖ ప్రతినిధి సరస్వతి రెడ్స్ సంస్థ ప్రతినిధులు మెహతాజ్, అమ్మాజాన్ ఎలక్ట్రికల్ వైర్‌మెన్ జాఫర్ పాల్గొని మే డే ఔన్నత్యం, కార్మిక చట్టాలను వివరించారు. లోక్‌అదాలత్ ద్వారా అందే న్యాయ సహాయాలను తెలిపారు.



బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికు లు

కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్మికులకు కేటాయించిన ఇళ్ల పట్టాల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇళ్ల పట్టాల విషయంలో కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కదిరి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుట్టపర్తిలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ 2007లో అప్పటి ప్రభుత్వం కార్మికులకు ఇంటి నివేశస్థలాలు, కమ్యూనిటీ భవనం కోసం స్థలం కేటాయించిందన్నారు. అయితే అప్పటి కార్మిక సంఘం అధ్యక్షుడైన ఎస్.అహ్మద్‌అలీ 323 మంది కార్మికులకు మంజూరైన ఇళ్ల పట్టాలను కార్మికులకు ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. ఆ తర్వాత రూ. లక్షల్లో డబ్బులు వసూలు చేసి అతడి బంధువులు, ఇతరులకు విక్రయించాడని ఆరోపించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని మొరపెట్టుకున్నారు. కార్మికులను మోసం చేసిన అహ్మద్‌అలీపై తగిన చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం

పుట్టపర్తి క్రైమ్ : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియోజకవర్గంలోని మండలాలకు అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ ఇన్‌ఛార్జి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమడగూరు-పెద్దిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఓడిసి-వి.సురేష్‌కుమార్, నల్లమాడ-పటాన్ గౌస్‌బాషా, బుక్కపట్నం-ఎర్రంశెట్టి రవికుమార్, కొత్తచెరువు-సాకే మోహన్, పుట్టపర్తి పట్టణ అధ్యక్షులుగా చంద్రకాంత్‌రెడ్డి, గ్రామీణ అధ్యక్షుడుగా పోతులరాజు గంగాధరం ను నియమించారు. మండల అధ్యక్షుల నియామకంతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

పశువుల నీటితొట్టె ప్రారంభం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పందిపర్తి పంచాయతీలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెను సోమవారం స్థానిక టిడిపి నాయకులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పశువుల కోసం నీటి తొట్టె ఏర్పాటు చేయాలని మంత్రి సవితను కోరగా ఆమె వెంటనే నీటి తొట్టి నిర్మాణానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, జనసేన నాయకులు రహంతుల్లా, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్, శాంతరాజు, యానిమేటర్ వెంకటేశులు, సోమనాథ్, నిడిమామిడి ఎస్‌ఎంసి ఛైర్మన్ జయరామ్, తిప్పన్న, మూర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులో నెలకొన్న పలు సమస్యలపై సోమవారం మానవ హక్కుల సంఘం నాయకులు ఎంవి.పాపన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు తహశీల్దార్ నీలకంఠారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాపన్న మాట్లాడుతూ సాగునీటి కాలువలు, శ్మశానవాటికకు వెళ్లే దారిలో ముళ్లపొదలు తొలగించాలని కోరారు. పుట్టపర్తి రోడ్డు, ధర్మవరం రోడ్డు, బుక్కపట్నం రోడ్డులో ఉన్న శ్మశానవాటికల్లో నీటి సౌకర్యం, స్నానపు గదులు ఏర్పాటు చేయాలన్నారు. జామియా మసీదు, అంగన్‌వాడీ సెంటర్ వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంజనమ్మ, మస్తానప్ప, లింగమూర్తి, ఆంజనేయులు, నాగలక్ష్మి, సుబ్బన్న, శేఖర్ పాల్గొన్నారు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

అసంఘటిత ఉద్యోగులకు న్యాయపరమైన అవగాహన అవసరమని, వారి హక్కులను తెలుసుకోవాలని పుట్టపర్తి మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపాల సయ్యద్ తెలిపారు. జడ్జి సోమవారం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న అసంఘటిత (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగులు, సిబ్బందికి న్యాయపరమైన అవగాహన కల్పించి సందేహాలు నివృత్తి చేశారు. జడ్జి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. యాజమాన్యాలు ఉద్యోగులకు చట్టపరమైన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పట్టణ సిఐ సునీత, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, సూపర్వైజర్లు హరిత, ఉషారాణి, గ్యారేజ్ ఇన్‌ఛార్జి విజయానంద్, డిపో మేనేజర్ ఇనయతుల్లా, అన్ని అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి సయ్యద్

విశ్రాంత ఉద్యోగుల కమిటీ తాలూకా అధ్యక్షుడిగా చలపతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సమావేశ కార్యాలయంలో సోమవారం ధర్మవరం తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడోసారి ఏకిల చలపతిని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చలపతి మాట్లాడుతూ సభ్యుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తానని వెల్లడించారు. నూతన కమిటీలో ప్రధాన కార్యదర్శిగా ఎ.నర్సిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా కె.రామయ్య, కోశాధికారిగా పి.సుధాకర్, ఉపాధ్యక్షులుగా నారప్ప, శ్రీరాములు, శివలింగన్న, కొండయ్య, రామ చంద్రప్ప, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, వెంకటస్వామి, రామిరెడ్డి, కుళ్లాయప్ప, కేశవయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం చలపతికి నాగేష్, భగవంతరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ముత్యాలు, కిరణ్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత

చిలమత్తూరు : మండలంలోని టేకులోడుకు చెందిన రుషి టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ బాలాజీరెడ్డి తన కుమారుడు రిత్విక్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని సోమవారం కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలోని సమర్థనం దివ్యాంగుల సంస్థకు రూ. 10వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని సంస్థ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. అనంతరం దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ట్రైనర్స్ నరసింహమూర్తి, కవిత, వెంకటరమణమ్మ, ఎర్రిస్వామి, రుషి టెక్నాలజీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న రుషి టెక్నాలజీస్ సిబ్బంది

నేరాలు ఘోరాలు

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

పరిగి : మండలంలోని మోద పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలోని ఓ మామిడి తోటలో కల్లుమరి గ్రామానికి చెందిన గంగాధరప్ప(35) నీటి సంపులో పడి మరణించాడు. హిందూపురం పట్టణానికి చెందిన శైలశ్రీనంజప్పకు చెందిన తోటలో గంగాధరప్ప ఏడాదిగా పనిచేస్తున్నాడు. ఇతడు రోజూ మామిడి తోటలో పని చేసి సాయంత్రం ఊరికి చేరుకొనేవాడు. నీటి సంపు ద్వారా పొలానికి నీటిని చేరవేసే క్రమంలో సంపులో పడి మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి : మండలంలోని ఎర్రాయపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై సోమ వారం ఉదయం బైక్‌ను కారు ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పూలకుంట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, చియ్యేడు గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై పూలకుంట వెళ్తుండగా ఎర్రాయపల్లి వద్ద మలుపు తిరుగుతుండగా అనంతపురం వైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడం తో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న ఐదున్నరేళ్ల చిన్నారికి గాయాల య్యాయి. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం సవీరా ఆసుపత్రికి తరలించారు. బెంగళూరు వాసులు కుటుంబ సభ్యులతో కలిసి కారులో మంత్రాలయం వెళ్లి రాఘవేంద్రస్వామిని దర్శనం చేసుకుని కదిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవర్ హల్‌చల్.. వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తచెరువు : డ్రైవర్ మద్యం మత్తులో 407 వాహనాన్ని ఇష్టారాజ్యంగా నడపడంతో ఒక వ్యక్తి గాయపడడంతో పాటు 4 బైక్‌లు ధ్వంసమైన సంఘటన సోమవారం రాత్రి స్థానిక పెనుకొండ రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన డ్రైవర్ దామోదర్ మద్యం మత్తులో 407 వాహనాన్ని నడుపుతూ స్థానిక పెనుకొండ రోడ్డులో ఒక మోటార్ సైకిల్ ని ఢీకొన్నాడు. ఆ తర్వాత లోచర్ల సమీపంలోని గంగమ్మ గుడి వద్ద నిలిపి ఉన్న రెండు మోటార్ సైకిళ్లను ఢీకొన్నాడు. కొత్తచెరువుకు చెందిన బాబు సత్యసాయి వాటర్ సప్లైలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి 407 వాహనంతో పాటు డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సిఐ సురేష్ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్ట్

అగళి : మండలంలోని మధూడి గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1600 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ధర్మవరం రూరల్ : మండల పరిధిలోని ఓ గ్రామ చెరువు కట్ట వద్ద నాలుగేళ్ల చిన్నారిని ఓ వ్యక్తి అసభ్యకరంగా ఫొటోలు తీసినట్లు ఫిర్యాదు అందడంతో పోక్సో కేసు నమోదు చేసనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నరసింహులు అనే వ్యక్తి చిన్నారికి అసభ్యకరంగా ఫొటోలు తీసినట్లు చుట్టుపక్కల వారు చిన్నారి తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో చిన్నారి తల్లి సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నరసింహులు పరారీలో ఉన్నాడని, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

బాలుడు అదృశ్యం..పోలీసులకు ఫిర్యాదు

నంబులపూలకుంట : మండలంలోని దాసరివాండ్లపల్లి గ్రామానికి చెందిన నారాయణ కుమారుడు ఏడేళ్ల అఖిల్ సోమవారం ఉదయం స్నేహితులతో ఆడుకుంటూ కనపడకుండా పోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు. కాషాయ వస్త్రాలు ధరించి, భిక్షాటన చేసే వారిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారని తెలిపారు. చుట్టుపక్కల పోలీసు స్టేషన్లకు సమాచారమిచ్చామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు

పావగడ : విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు విద్య ఒక సాధనమని అంత్యోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ బికె.మునిస్వామి తెలిపారు. ఎస్ఎస్ఎల్‌సి పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం పట్టణంలోని గురుకుల పాఠశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మునిస్వామి, మున్సిపల్ ఛైర్మన్ సుదేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతోనే లక్ష్యాలను చేరుకోగలరన్నారు. అనంతరం 140 మందికి పైగా విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు, ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల సమాఖ్య అధ్యక్షుడు ప్రసన్నమూర్తి, కార్యదర్శి అంజన్‌శెట్టి, కోశాధికారి జి.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు : 2025-26 విద్యా సంవత్సరానికి గానూ మండలంలోని ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతికి 25శాతం ఉచిత సీట్లు కేటాయించారని ఎంఇఒ పద్మప్రియ తెలిపారు. అనాథలు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద ఓసీలు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.

వైఎస్ఆర్ స్థూపం ఏర్పాటు

హిందూపురం : ఎమ్మెల్యే బాలకష్ణ పర్యటనలో భాగంగా మున్సిపల్ అధికారులు పట్టణంలోని రహమత్ పురంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి స్తూపాన్ని తొలగించారని వైసిపి నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్ రాత్రికిరాత్రే తొలగించారని వైసిపి నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు రహమత్ పుర సర్కిల్‌లో గతంలో స్తూపం ఉన్న స్థానంలోనే నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో నూతనంగా స్థూపాన్ని ఏర్పాటు చేయించారు. అనంతరం వైసిపి నేత గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామి రెడ్డితో పాటు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నేత నాగేంద్రబాబు మృతికి నివాళి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని కెపి పాఠశాలలో సోమవారం యుటిఎఫ్ మండల అధ్యక్షులు మాలింగప్ప, గుడిబండ మండల అధ్యక్షులు టి.మూడ్లగిరియప్ప ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకుడు సికె నాగేంద్రబాబు సంతాపసభ నిర్వహించారు. ముందుగా వారు నాగేంద్రబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, జిల్లా కార్యదర్శి డి.నరసింహప్ప మాట్లాడుతూ సి.కె. నాగేంద్రబాబు ఉపాధ్యాయుడిగా, సంఘం నాయకుడిగా, జిల్లా, రాష్ట్ర బాధ్యతలు నిర్వహించి అనంత జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్‌కు నిస్వార్థ సేవలు అందించారన్నారు. జన విజ్ఞాన వేదికను ఆయుధంగా చేసుకొని సమాజంలో సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేశారన్నారు. ఆయన పోరాట పటిమ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఓబన్న, ఈశ్వర్, కదురన్న, నంజప్ప, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



నాగేంద్రబాబు సంతాప సభలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు